క్లుప్తంగా

సబ్సిడీపై జనుము, జీలుగ

నగరి: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో శనివారం నుంచి జనుము, జీలుగ సబ్సిడీపై ఇవ్వనున్నామని వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.88 పలికే 10 కేజీల బ్యాగు సబ్సిడీపై రూ.44కు ఇస్తామన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయపురంలో..

విజయపురం: తమ కార్యాలయంలో 50 క్వింటాళ్ల జనుము, 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారిణి రజిని తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకంతో పాటు ఆధార్ కార్డు తీసుకు రావాలని, 50శాతం సబ్సిడీతో రూ.44లకే ఇస్తామన్నారు.

మాతా-శిశు మరణాల నివారణే లక్ష్యం

- టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు



పెద్ద పాండూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్య బృందం

వరదయ్యపాళెం: మాతా-శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలోని జిల్లా గణాంకాధికారి నాగేంద్ర కుమార్, ఇన్‌చార్జి డీపీహెచ్‌ఎంఓ బేబిరాణి, డీపీఓ ప్రకాష్ శుక్రవారం మండలంలోని పెద్ద పాండూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయి వైద్య రికార్డులను పరిశీలించి ధ్రువీకరించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని, అందుకు సంబంధించిన వైద్య సదుపాయాలు సకాలంలో అందించి, రక్తహీనత సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే బలవర్థక ఆహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పెద్దపాండూరు సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య, అనిత, పీహెచ్‌ఎన్ రాణెమ్మ, ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రుడు, ఎంఎస్‌హెచ్‌పి గుణశృతి, సూపర్‌వైజర్ పవనకుమారి, ఏఎన్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

పొరబాట్లకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్వో

చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపు రోజున ఏ చిన్న పొరబాటు జరగడానికి వీల్లేదని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపునకు కేటాయించిన అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్స్ నుంచి కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్‌ను కేంద్రానికి జాగ్రత్తగా పంపించాలన్నారు. ఈవీఎం యంత్రాలను తీసుకెళ్లేటప్పుడు పక్కాగా పర్యవేక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 4న ఎస్వీ సెట్ కౌంటింగ్ కేంద్రంలో చిత్తూరు అసెంబ్లీ ఈవీఎంలు లెక్కించే సమయంలో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. చిత్తూరు అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్‌కు 3 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టేబుల్స్ వద్ద అన్ని రకాల ఫార్మెట్‌లు, స్టేషనరీ, పీఎస్‌ల వారీగా పోల్ డేటా, 17 సీ ఫారంలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విధులపై ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. తప్పులు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, చిత్తూరు రూరల్ తహసీల్దార్ హసీనాబీ, అధికారులు పాల్గొన్నారు.

చింతచెట్టుకు మంటలు

నారాయణవనం: మండల కేంద్రంలో చింతచెట్టుకు అంటుకున్న మంటలను ఫైర్ స్టేషన్ సిబ్బంది అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వేకువజామున స్థానిక పద్మసరస్సు చుట్టూ గట్టుపై ఉన్న ఓ చింతచెట్లలో ఓ చెట్టు మొదలుకు ఉన్న తొర్రలో మంట పెట్టారు. అసలే ఎండలకు బాగా ఎండిన చింత చెట్టు తొర్ర నుంచి మంటలు రేగాయి. ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు మంటలను గుర్తించి 100కు సమాచారం ఇవ్వడంతో 8 గంటల సమయంలో నగరి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. మంటలు రేగిన సమయంలో గాలి వీయకపోవడం పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదంపై టీటీడీ ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాధికారి నాగరాజు తెలిపారు.

‘బంతి’తో ఆదాయ పరిమళం

- నియోజకవర్గంలో 40 ఎకరాల్లో పూల సాగు



ముడిపల్లెలో సాగులో ఉన్న బంతి తోట

నింద్ర: రైతులు సంప్రదాయ పంటలతోపాటు పూల సాగు వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. బంతి పూలు సాగుచేస్తూ ఆదాయం చవిచూస్తున్నారు. నగరి మండలంలోని వుండలంలోని ముడిపల్లె, మూలనెత్తం, అడవికొత్తూరు, తెరణి, చిన్నతాంగేశ్, కృష్ణారామపురం, నింద్ర మండలం ఎలకాటూరు గ్రామం, విజయపురం మండలంలో కళియంబాకం, పాతార్కాడు, మహారాజపురం, మల్లారెడ్డి కండ్రిగ గ్రామాలు, పుత్తూరు మండలంలో గోపాలకృష్ణాపురం, కొండల చెరువు గ్రామాల్లో రైతులు పూల సాగు చేస్తున్నారు. ఇక్కడ సాగు చేసిన పూలను నేరుగా చెన్నై-కోయంబేడు మార్కెట్‌కు, తిరుపతి పూల మార్కెట్‌కు రవాణా చేస్తున్నారు. నియోజకవర్గం నుంచి నిత్యం 250 కేజీల వరకు పూలు మార్కెట్‌కు వెళుతాయి. పసుపు బంతి పూలు కిలో రూ.40 నుంచి రూ.50 వరకు, ఎర్ర బంతి కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. ఒక గుంటకు 15 నుంచి 20 కిలోల పూల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

జాతరల వేళ.. మంచి ధర

మిగిలిన పైర్లకు, పూల సాగుకు ఎంతో వ్యత్యాసం ఉంది. మార్కెట్‌లో పూల ధర నిలకడగా ఉండదు. రోజుకో ధర పలుకుతుంది. పండుగలు, పెళ్లిళ్ల సందర్భాలలో పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ధర అమాంతం పెరుగుతుంది. ముహూర్తాలు లేకున్నా, పండుగలు, పబ్బాలు తక్కువగా ఉన్నా ధరలు తగ్గుతాయి. దీనికితోడు వాతావరణం కూడా పూల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. పూల తోటలకు సంబంధించి ఎకరాకు చీడపీడల నివారణ, కోత కూలీ ఖర్చులు పోను నెలకు రూ. 30వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. రైతులు బంతి పూలతో పాటు సీజన్ల వారీగా వచ్చే మల్లె, రోజా, సంపంగి పూలను సాగుచేస్తూ ఆదాయం పొందుతున్నారు.



ఎలకాటూరులో సాగులో ఉన్న బంతి తోట

పదేళ్లుగా పూలసాగే ఆధారం



నాకు అర ఎకరం పొలం ఉంది. పదేళ్లుగా బంతి పూలు సాగు చేస్తున్నా. ప్రతి రోజూ పొద్దున్నే పూలు కోసి చెన్నై కోయంబేడు మార్కెట్‌కు, కొన్నిసార్లు తిరుపతి, పుత్తూరు, నగరికి తీసుకెళ్తాం. పండుగ రోజుల్లో పూలకు డిమాండ్ ఎక్కువ. ఇతర ప్రాంతాలకు తరలించడానికి వీలులేని పరిస్థితుల్లో గ్రామాల్లో అమ్మేస్తాం.

– కె.జ్ఞానమ్మ, ఎలకాటూరు

మల్లె, బంతిపూలు సాగు చేస్తున్నా



నాకున్న రెండు ఎకరాల పొలంలో బంతి పూలు సాగుచేస్తున్నా. పదేళ్లుగా పూల సాగు చేస్తున్నా. పూలను తిరుపతి మార్కెట్‌కు తరలిస్తా. పెళ్లిళ్లు, ఇతర పండుగ రోజుల్లో ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. తిరుపతికి రవాణా చేసిన పూలు పోను మిగిలిన పూలను వివిధ ప్రాంతాల్లో అమ్ముతాను. నెలకు రూ. 30 వేలు ఆదాయం వస్తోంది.

– లింగరాజు, ఎలకాటూరు

వైభవంగా కావమ్మ.. మారయ్య ఊరేగింపు



నాగలాపురం: పట్టణంలో వీకేఎం వీధిలో ఉన్న కావమ్మ సమేత మారయ్య ఆలయంలో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా మూడో రోజు శుక్రవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా అమ్మవారికి పలు రకాల పూజలు చేశారు. వేకువజామున ఆలయాన్ని శుద్ధి చేసి ఆలయాన్ని పూలతో అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం కావమ్మకు ప్రత్యేక పూజలు చేసి, విశేష అలంకరణ చేశారు. భారీ ఎత్తున భక్తులు, మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులందరికీ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి పుత్తూరు శ్రీవిద్య కళాశాల విద్యాసంస్థ యాజమాన్యం ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారిని రకరకాల పూలతో సుందరంగా అలంకరించి తప్పెట్లు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జె.గోవిందుడు, చెంగల్‌రాయులు, ఆర్‌వీ రమణయ్య, రాంబాబు, గురవయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బలి బండి ఉత్సవం



బలి బండి కూడుతో భక్తులను ఆకట్టుకుంటున్న భీముని వేషధారి

కార్వేటినగరం: కొల్లాగుంట గ్రామంలో శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బలి బండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బకాసురునికి బండి కూడు తీసుకువెళ్లి, బకాసురుని భీముడు సంహరించే ఘట్టాన్ని హరికథా నాట్యమయూరి భాగవతారిణి ఉషారాణి భక్తులకు కళ్లకు కట్టినట్లుగా హరికథాగానం చేశారు. సాయంత్రం భీముని వేషధారుడు ఎడ్ల బండిపై బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారతం మిట్ట జన సంద్రంగా మారింది. ఈ క్రమంలో భాగంగా గ్రామంలో మొక్కులున్న భక్తులు కూడా ఎడ్ల బండ్లతో అలరించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు వ్యవహరించారు. అంతకు ముందు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు.

నేడు కీళపూడిలో హనుమజ్జయంతి

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో ఉన్న శ్రీఅభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామివారికి ఉదయం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో అరటి చెట్లు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దాతలు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కృష్ణారెడ్డి సేవలు ఎనలేనివి



కృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): సింగిల్‌విండో సీఈఓగా కృష్ణారెడ్డి ఎనలేని సేవలు అందించారని పెనుమూరు సింగిల్ విండో అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం సీఈఓగా పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గోవిందరెడ్డి మాట్లాడుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ రుణ సౌకర్యాలు కల్పించి వ్యవసాయ రంగానికి తోడ్పాటు అందించిన వ్యక్తి కృష్ణారెడ్డి అని, ఆయన సేవలను రైతులు ఎప్పటికీ మరచిపోరన్నారు. అనంతరం జడ్పీటీసీ దొరస్వామి యాదవ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో కృష్ణారెడ్డి అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. కృష్ణారెడ్డి, ఆయన సతీమణి ఈశ్వరిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మహా సముద్రం సురేష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు దూది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దివ్యాంగుడు భవిత కేంద్రంలో ఉండాలి

-జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి



తేజస్వరూప్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి



ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న భవిత కేంద్రం టీచర్లు

పుత్తూరు: ప్రతి దివ్యాంగుడు భవిత కేంద్రంలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సమగ్ర శిక్ష, సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వడమాలపేట మండలంలో ఐఈఆర్‌టీ, సీఆర్‌ఎంటీ, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లతో చేస్తున్న సర్వేని పరిశీలించారు. వడ్డిపల్లెలోని దివ్యాంగుడు తేజస్వరూప్ ఇంటికి వెళ్లి అతని తల్లిదండ్రులను సంప్రదించారు. ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం పలు రకాల సేవలను అందిస్తోందని, చిన్నవయసులోనే వికలత్వాన్ని గుర్తించి, అలాంటి పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ ఇవ్వడంతోపాటు రోజువారీ తగిన కృత్యాలను నేర్పిస్తామన్నారు. వడమాలపేట మండలంలో 18 ఏళ్ల లోపు 111 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. కొత్తగా మరో పది మందిని గుర్తించామని, వారి వయసుకు తగినట్టు వివిధ పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ప్రతి దివ్యాంగ విద్యార్థికీ చక్కని భవిష్యత్తు కల్పించాలన్నదే భవిత కేంద్రాల ఉద్దేశమన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్వే

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలను ఇంటింటి సర్వే ద్వారా గుర్తించాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. తెలిపారు. శుక్రవారం భవిత కేంద్ర టీచర్లు బాలాజి, విమరాజు ఇంటింటికి వెళ్లి ప్రత్యేక అవసరాల గల పిల్లల సర్వే చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రులు టీచర్లకు సహకరించి మీ పిల్లలను భవిత కేంద్రానికి వచ్చేలా సూడాలన్నారు. భవిత కేంద్రానికి వచ్చే పిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకం, మధ్యాహ్న భోజనం, ఫిజియోథెరపిస్టు వ్యాయామం ఉంటాయన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్వేటినగరంలో సింహ వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు



ఊంజల్ సేవలో సేదదీరుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



భక్తులను ఆకట్టుకుంటున్న చెక్కభజనలు



మృగరాజుపై వేణుగోపాలుడి విహారం

కార్వేటినగరం: టీటీడీ అనుబంధంగా ఉన్న ప్రముఖ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం రాత్రి కాలసర్పంపై నృత్య వేణుగోపాలుడిగా ముత్యపు పందిరి వాహనంపై, ఉదయం సింహ వాహనంపై వేణుగోపాలుడు భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు అభిషేకం, శుద్ధి, తోమాల, అర్చన జరిపి తొలిగంటలో నైవేద్యం సమర్పించారు, ఉదయం 7.30 గంటలకు వేద నరసింహ అవతారంలో స్వామివారు మృగరాజు అయిన సింహ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.

అనంతరం 10 నుంచి 11 గంటల మధ్య రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితులు వేద మంత్రాల నడుమ పాలు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలం తదితర సుంగంధ ద్రవ్యాలతో వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ అవతారంలోని శ్రీవేణుగోపాలునికి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో టీటీడీ బృందం గాత్ర కచేరీతో కనుల పండువగా ఊంజల్‌సేవ నిర్వహించారు,

ముత్యపు పందిరిపై...

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేతుడై శ్రీవేణుగోపాలుడు ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరి చిన్నారుల కోలాటాలు, మహిళల చెక్కభజనల, మంగళ వాయిద్యాలు, నడుమ అత్యంత వైభవంగా పురవీధుల్లో ఊరేగారు. భక్తులు ఇంటింటా కర్పూర హారుతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవతో స్వామివారిని పవళింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టు నారాయణ దాశరథి, వేదపండితులు గోపాలాచార్యులు, తరుణ్‌కుమార్, అలంకార పండితులు మోహన్ భట్టాచార్యులు, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ముత్యపు పందిరి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు

నేడు కల్యాణోత్సవం

కార్వేటినగరంలో జరుగుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. ఆలయంలో సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. కల్యాణోత్సవాలలో పాల్గొనదలచిన భక్తులు రూ.750 చెల్లించి దంపతులు, లేదా ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రాత్రి 7గంటల నుంచి సర్వభూపాల వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

పంబ వాయిద్యాలతో అమ్మవారికి పొంగళ్లు



ఓం శక్తికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని నిశ్శింకాపురం గ్రామంలో వెలసిన ఓం శక్తి అమ్మవారికి, నరసింహపురం గ్రామంలో వెలసిన గ్రామ దేవతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, అంబళ్లు పోశారు. ఉదయం గురుస్వామి అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యి తదితర అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటికి నుండి ఓం శక్తి భక్తులు పంబ వాయిద్యాలతో పొంగళ్లు తీసుకొచ్చి అమ్మవారి దేవాలయాన్ని మూడు సార్లు ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో అమ్మవారిని గ్రామ దేవతకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి అంబలి పోశారు. అమ్మవార్లను సుందరంగా అలంకరించి కర్పూరం వెలిగించి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూజలకు పాల్గొన్న భక్తులకు పంచామృతం, తీర్థ ప్రసాదం అందించారు.



టెంకాయలు కొట్టి మొక్కుతున్న మహిళలు



నరసింహపురంలో అమ్మవారికి అంబలి పోస్తున్న భక్తులు